రామయ్యకు ముత్తంగి అలంకరణ

నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 19: భద్రాద్రి దివ్యక్షేత్రంలో అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను అర్చకులు సోమవారం ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

అన్నదానానికి విరాళం

రూ. లక్ష చెక్కును అందజేస్తున్న వీకే రఘునాథన్

భద్రాచలం, ఫిబ్రవరి 19: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి పట్టణానికి చెందిన ఎం సుశీల, ఎం రామ అమృతరావు, చెన్నైలోని శ్రీనివాసపురం కాలనీకి చెందిన వికే రఘునాథన్ ఆలయ అధికారి లింగాల సాయిబాబాకు సోమవారం చేరి రూ.లక్ష అందజేశారు. తొలుత వారు రామయ్యను దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతను ఆలయ అధికారులు సత్కరించి, స్వామి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం అర్చకులు, స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

పోలీస్ స్టేషన్లను సందర్శించిన డీఎస్పీ

ఎస్సై, సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, ఫిబ్రవరి 19: టేకులపల్లి, బోడు పోలీసు స్టేషన్లను ఇల్లెందు డీఎస్పీ ఎన్ చంద్రభాను సోమవారం సందర్శించారు. ఎస్సైలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట టేకులపల్లి, బోడు ఎస్సైలు సైదా రవూఫ్, శ్రీకాంత్, ఏఎస్సైలు ఎం వెంకటేశ్వరరావు, బీల్యీనాయక్, విద్యాసాగర్, భాను, శిరోమణి, ఉపేందర్ ఉన్నారు.

క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, ఫిబ్రవరి 19: విద్యతో పాటు క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన చెకుముఖి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల విద్యా నైపుణ్యాలను తనిఖీ చేశారు.

పరిశుభ్రత మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
PLOT FOR SALE
★Sunrise Infra హైదరాబాద్-విజయవాడ హైవే సూర్యాపేట DTCP & Rera అప్రూవ్డ్ ప్లాట్లు @ 6,500/- to 8,500/-. 80% బ్యాంక్ లోన్. Ph: 9912005950.
NT-138
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 19: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై శ్రీరాముల శ్రీను హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెంబర్ ప్లేట్లు ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతిభద్రత పరిరక్షణకు, పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 19 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అన్నిశాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలు అడిగి తెలుసుకొని వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సీఎం ప్రజాదర్బార్‌కు 38 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌వో రవీంద్రనాథ్, డీఆర్డీవో విద్యాచందన, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఓటర్ టర్నౌట్‌ను పెంచాలి

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : ఓటర్ టర్నౌట్ పెరిగేలా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. ఓటర్ల నమోదుకు గత జనవరి 1వ తేదీని ని ప్రామాణికంగా తీసుకొని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. ఓటరు జాబితాలో వచ్చే మార్పులపై ఎప్పటికప్పుడు స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కలెక్టర్ రాంబాబు, భద్రాచలం ఆర్డీవో మంగీలాల్, ఇల్లెందు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, డీఆర్‌వో మధు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎలక్షన్ సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 19: మండలంలోని బోజ్జాయిగూడెంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే సమ్మక్క-సారలమ్మ నంది మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం జాతర ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు స్నానాలు చేసేందుకు బోర్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతరకు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలి వస్తూ ఉంటారని, భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలుగకుండా చూడాలని పంచాయతీ సిబ్బంది, కమిటీ సభ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధన్‌సింగ్, నాయకులు సాంబమూర్తి, రమేశ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

సింగరేణి క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సిలింగ్

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 19: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు సోమవారం పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో క్వార్టర్ల అలాట్‌మెంట్ కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. జనరల్ కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగంగా మణుగూరు ఏరియాలో స్పెషల్-డీ, డీటైప్ క్వార్టర్లలో ఖాళీగా ఉన్న 70 క్వార్టర్ల కేటాయింపునకు 158మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఏరియా అధికార ప్రతినిధి, డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్ తెలిపారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఆదేశాలు, కంపెనీ నిబంధనల మేరకు క్వార్టర్ పొందెందుకు పూర్తి అర్హతలు, సీనియార్టీని పరిగణలోకి తీసుకొని క్వార్టర్లను అధికారికంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం వెంగల రావు, ఏజీఎం(సివిల్) డీ వెంకటేశ్వర్లు, కార్మిక నాయకులు వైరాంగోపాల్, వీ కృష్ణంరాజు, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, జూనియర్ అసిస్టెంట్ శ్రీయ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు

సమావేశంలో పాల్గొన్న మోహన్ రాథోడ్ తదితరులు

మూడు డీఏల హామీ ఏమైంది..?

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19: పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల విడుదల హామీ ఏమైందని టీఎస్‌టీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ రాథోడ్ ప్రభుతాన్ని ప్రశ్నించారు. కొత్తగూడెంలో సోమవాం సమావేశంలో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో మూడు డీఏలను విడుదల చేస్తామన్న ఎన్నికల హామీని కాంగ్రెస్ నిలుపుకోలేదని విమర్శించారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసగించడమే అవుతుందని ధ్వజమెత్తారు. డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బానోత్ రాములు నాయక్, గుగులోత్ మోహన్‌లాల్, సపావత్ బాలకృష్ణ చౌహాన్, తేజావత్ రామునాయక్, హలావత్ వీరభద్రం, రామచంద్ర, లోకేష్, హీరాలాల్, వీరన్న, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి

పాల్వంచ, ఫిబ్రవరి 19: శతాబ్దాల క్రితమే లౌకిక విలువలతో రాజ్యాన్ని పాలించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి వేడుకను బహుజన ఐక్య వేదిక, బహుజన విజ్ఞాన వేదిక సోమవారం స్థానిక సిద్ధార్థ పాఠశాలలో నిర్వహించాయి. శివాజీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నబీసాహెబ్, బరగడి దేవదానం, శనగ వెంకటేశ్వర్లు, డాక్టర్ శేషగిరిరావు, బండి లక్ష్మణ్, తురక లక్ష్మయ్య, నిమ్మల రాంబాబు, శనగ రాంచందర్‌రావు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 19 : మండలంలోని సోములగూడెం లక్ష్మీదేవిపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఆర్.కృష్ణ, లక్మా, రమకుమార్, మోహన్, నరేశ్‌కుమార్, శ్రీనివాస్, రాందాస్, అశోక్, రాఘవులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 19: మండలంలోని లక్ష్మీనగరం గిరిజన బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు సోమవారం ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రితీశ్ ఠాగూర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో క్రీడా కోటాలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెకండ్ కమాండెంట్‌లు కమల్‌వీర్, ప్రీతా, అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జున్, దుమ్ముగూడెం సీఐ అశోక్, క్రీడాకారులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రితీశ్ ఠాగూర్

3న పల్స్‌పోలియో

జూలూరుపాడు, ఫిబ్రవరి 19: మార్చి 3న పల్స్ పోలియో ఉంటుందని ప్రభుత్వ వైద్యుడు రాకేష్ తెలిపారు. దీని జయప్రదానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. డాక్టర్ ప్రదీప్తి, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాధిక, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష పుష్పార్చన

చుంచుపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని గౌతంపూర్ పంచాయతీలోగల కనకదుర్గ పరమేశ్వరి అమ్మవారి త్రయోవింశతి(23వ) వార్షికోత్సవాన్ని ప్రధాన అర్చకులు వెలవలపల్లి అనిల్‌శర్మ సోమవారం నిర్వహించారు. లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు చేశారు.

ఆసుపత్రికి రూ.24.50 లక్షలు మంజూరు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 19: అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి మౌలిక వసతుల కల్పన కోసం రూ.24.50 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆసుపత్రిలో మార్చురీ, డయాలసిస్ కేంద్రానికి అవసరమైన వైద్యులు, వసతులను ప్రభుత్వం కల్పించనుందని చెప్పారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు అంగీకరించినట్లు వివరించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీడీపీవోగా సలోమి

చుంచుపల్లి, ఫిబ్రవరి 19 : ఐసీడీఎస్ కొత్తగూడెం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవోగా సలోమిని నియమించారు. ఇక్కడ పనిచేసిన సీడీపీవో లెనీనా ములుగు జిల్లా అధికారిగా బదిలీపై వెళ్లడంతో బూర్గంపాడు ప్రాజెక్టులో పనిచేస్తున్న ఏసీడీపీవోకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జూలూరుపాడు, ఫిబ్రవరి 18 : మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు ఖమ్మంలో జరిగే విప్లవ పార్టీల ఐక్యత జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా)జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ సోమవారం ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరంను కలిసిన సీఐ సురేశ్

టేకులపల్లి, ఫిబ్రవరి 19: ఎమ్మెల్యే కోరం కనకయ్యను మండలంలోని కోయగూడెం గ్రామంలో ఎమ్మెల్యే తన స్వగృహంలో టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్ సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 19: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందించి ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలని వైద్యులకు సూచించారు. అన్ని వార్డులు, డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌రావు, డీసీఎంఎస్ రవిబాబు, డీఎంహెచ్‌వో శిరీష, ఆర్ఎంవో పుష్పలత ఉన్నారు.

మ్యాథ్స్ ఒలంపియాడ్ ర్యాంకర్‌కు అభినందన

పాల్వంచ, ఫిబ్రవరి 19: జిల్లా స్థాయిలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ జిల్లా స్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పాల్వంచ మార్కెట్ ఏరియాలోని స్టార్ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థిని గుమ్మళ్ల జయలేఖ రెండవ ర్యాంక్ సాధించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇటీవల ఆమె బహుమతి అందుకుంది. ఆమెను ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు భాస్కర్‌రావు, శ్రీనివాసరెడ్డి, స్వరూప, మౌనిక సోమవారం అభినందించారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 19: మేడారం భక్తుల దాహార్తి తీర్చేందుకు కొత్తగూడెం బస్టాండ్‌లో మజ్జిగ, మంచినీటి పంపిణీ కేంద్రాన్ని పట్టణ యువకులు కొందరు ఏర్పాటు చేశారు. దీనిని ఆర్టీసీ డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులు దుంపల ఓంప్రకాష్, ఎస్‌కె.ఖదీర్ పాషా, వినోద్, అఖిల్, జహీర్, దావూద్, రహమత్, అన్వర్‌పాషా, రోహిత్, విజయ భార్గవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19: పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా హెచ్ఎం లీల కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా, విద్యార్థులను మానసికంగా సంసిద్ధం చేసేందుకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ప్రణాళికాబద్ధంగా చదవడం, జ్ఞాపక శక్తి చిట్కాలు, పంచసూత్రాలు, టైం టేబుల్ తయారీ, సబ్జెక్టులవారీగా సన్నద్ధత, పరీక్ష గదిలో పాటించాల్సిన జాగ్రత్తలు తదితరాంశాలపై వ్యక్తిత్వ వికాస నిపుణుడు జవ్వాది వెంకటేశ్వరబాబు అవగాహన కల్పించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

రామవరం, ఫిబ్రవరి 19: సింగరేణి కొత్తగూడెం ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు సత్యనారాయణ, హరిత, అపర్ణ బదిలీ అయ్యారు. వారికి సన్మాన, వీడ్కోలు కార్యక్రమాన్ని కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు సోమవారం నిర్వహించారు. అధికారులు కోటిరెడ్డి, రామకృష్ణ, అచ్యుతరామయ్య, కల్యాణ్, దుర్గ, నవీన్, షబ్బీర్, మోహన్, మధుసూధన్, బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి వీరభద్రస్వామి కల్యాణానికి అంకురార్పణ

చర్ల, ఫిబ్రవరి 19: మార్చి 8, 9తేదీల్లో జరుగనున్న శివరాత్రి సందర్భంగా మండలంలోని తేగడలోని శ్రీభద్రకాళీ వీరభద్రస్వామి ఆలయంలో మూడు రోజులపాటు స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు సన్నాహాలు ప్రారంభించారు. సోమవారం తొలి కార్యక్రమంగా ఆడబిడ్డలు పసుపుకొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆదివాసీ పిల్లలను పాఠశాలకు పంపించాలి

కరకగూడెం, ఫిబ్రవరి 19: అటవీ ప్రాంతాల్లో నివాసముంటున్న వలస ఆదివాసీలు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి చక్కటి భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆధార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోలెం రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని కన్నాయిగూడెం పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీగూడెం అంగారిగూడెంలో ఆదివాసీ పిల్లలకోసం పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు. సంస్థ సభ్యుడు బట్టా భిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాలో 'కొత్తగూడెం' రికార్డ్

రామవరం, ఫిబ్రవరి 19: బొగ్గు రవాణాలో సింగరేణి కొత్తగూడెం ఏరియా రికార్డుల పరంపరను కొనసాగిస్తోందని జీఎం శాలెంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నాటికి అత్యధికంగా 135.36 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరపు 135.06 లక్షల టన్నుల రవాణా రికార్డును 42 రోజుల ముందుగానే అధిగమించినట్లు తెలిపారు. ఈ విజయానికి కారకులైన ఉద్యోగులు, అధికారులు, యూనియన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

22న జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19: ఈ నెల 22న జిల్లాస్థాయిలో 9వ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ అండ్ తెలంగాణ బయోలాజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.00 గంటలకు స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో పరీక్ష ప్రారంభమవుతుందని, జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి ఒకొక్కరు చొప్పున మాత్రమే పాల్గొనాలని వివరించారు. పరీక్షలో ప్రశ్నలన్నీ పూర్తిగా భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల నుంచి బహుళైచ్ఛిక పద్ధతిలో ఉంటాయని తెలిపారు. ఫిజిక్స్, బయాలజీ టీచర్ల ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 19: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19: 2023-24 విద్యాసంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎంపికైతే రూ.20 లక్షలు, విమాన ప్రయాణ ఖర్చులకు మరో రూ.60వేలు మంజూరవుతాయని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మణుగూరుటౌన్, ఫిబ్రవరి19: మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్గత సీసీ రోడ్లకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం శంకుస్థాపన చేశారు. పినపాకలో అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని, ఇందులో భాగంగా రూ.24లక్షల నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్గతరోడ్లు వేయించడం జరుగుతుందన్నారు.

గృహజ్యోతి పథకానికి సహకరించాలి

పినపాక, ఫిబ్రవరి 1: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా పొందేందుకు వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఏఈ కావ్య కోరారు. సోమవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు ఆధార్, రేషన్‌కార్డు, గృహజ్యోతి దరఖాస్తు ఫారం, కరెంటు బిల్లు, ఫోన్ నెంబరు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో లేనివారు స్థానికంగా ఉన్న విద్యుత్ అధికారులకు ఇవ్వాలన్నారు.

పెద్దిరెడ్డిగూడెం గ్రామసభ రసాభాస

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ గ్రామ సభ రసాభాసాగా సాగింది. సోమవారం ఎర్రగుంట రైతు వేదికలో పంచాయతీలో అభివృద్ధి పనుల నిర్వాహణకు నిర్వహించిన గ్రామ సభ లో రెండు వర్గాల తీరుతో వివాదం నెలకొన్నది. ఒక వర్గం గ్రామ సభ నుంచి వెళ్లిపోవడంతో మరో వర్గం గ్రామ సభను కొనసాగించి పనులకు తీర్మానం చేయాలని పట్టుపట్టారు. పనులకు సంబంధించిన పూర్తి ప్రొసిడింగ్స్ వచ్చిన తర్వాతే తీర్మానాలు చేస్తామని అధికారులు సభను వాయిదా వేశారు. అభివృద్ధి పనులకు మరోక రోజు గ్రామ సభను నిర్వహించి పనులకు తీర్మానం చేయడం జరుగుతుందని ఎంపీవో షబ్నా చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

రేపు ఐటీడీఏలో భోగ్ భండార్

భద్రాచలం, ఫిబ్రవరి 19: సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో బుధవారం ఉదయం 10గంటలకు భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంత్ సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు హరిశ్చంద్ర నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, లంబాడా (బంజారా) తెగకు చెందిన వారు హాజరు కావాలని కోరారు.

రేపు కొబ్బరి రైతుల స